ఆమెని ఒక బంధువుల యింట్లో చూడడం తటస్థించింది. లేత పసుపు రంగు వాయిల్ చీర కట్టుకుని, కడిగిన ముత్యంలా మెరుస్తోంది. మనిషిని చూడగానే ఆకట్టుకునే ఆకర్షణ ఏదో వుంది. జుత్తు దువ్వుకోవడంలో చీర ధరించడంలో, పొందికగా కూర్చోడంలో - ప్రతివిషయంలో ఓ అందం కనిపిస్తోంది, ఆమె చేతివేళ్లు సన్నగా. పొడుగ్గా వున్నాయి. గోళ్లు గుండ్రంగా కత్తిరించి పగడాలు పొదిగినట్లు మెరుస్తున్నాయి.

ఆమె పేరు మధు. చాలా తెలివైనదని పేరు. ఆ ఏడాదే ఎమ్. ఎ. డిగ్రీ పుచ్చుకుంది. యూనివర్సిటీలో ప్రథమ శ్రేణిలో వచ్చి బంగారుపతకం తెచ్చుకుంది.

మధు అంటే నేను యిష్టపడ్డాను.

అన్నివిధాలా అనువైన సంబంధమని మా వాళ్ళు ఒప్పుకున్నారు.

నేను ఇంజినీరింగ్ పాసై, జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను. ఉద్యోగంలో పైకి వచ్చే అవకాశాలు వున్నాయి. కుటుంబ బాధ్యతలు లేవు. అందుకని మా పెళ్ళికి ఆడపెళ్ళివారి వద్దనించీ ఏ అభియోగం లేకపోయింది.

మధూకీ, నాకూ వివాహం జరిగింది. పదిరోజులు యిట్టే పెళ్ళి హడావిడిలో గడిచిపోయాయి మధూని తీసుకుని ఒంటరిగా శాంతానగర్ వచ్చేసాను.

కాపరం పెట్టగానే మా అసలు జీవితం ప్రారంభమైంది. రైలు దిగి యిల్లు చూస్తూనే ముఖం చిట్లించింది మధు. ఇల్లు చిన్నదనికాదు. ఇల్లంతా గలీజుగా వుందట. అప్పటికీ నేను ముందుగా వుత్తరం రాస్తే నా స్నేహితుడు యిల్లు తుడిపించి, కడిగించి పెట్టాడు

"ఎంత ఘోరంగా వుంది ప్రకాశ్!" అంది మధు.

"బ్రహ్మచారి కొంప యింతకంటె బాగా ఎలా వుంటుంది? అయినా నా కళ్ళకి బాగానేవుంది. బెనర్జీ తుడిపించాడు కదా!"

"నీ కళ్ళకి బాగుందా? నా మట్టుకు నాకు ఎన్ని రోజులు శుభ్రంచేస్తే బాగుపడుతుందో తెలియటంలేదు"

"ఇవాళేం పెట్టుకోకు. స్నానం చేసిరా. బెనర్జీ భోజనానికి పిలిచాడు. వెళ్ళాలి. ఎదురు చూస్తూవుంటారు."

"స్నానం ఎలా చెయ్యను ప్రకాశ్? ముందరీ యింటిపని చూసిన తర్వాతే తక్కినవి" అంది, చేతిలో హేండ్ బాగ్ అల్మారాలో పెడుతూ... నాకే ఆశ్చర్యంవేసింది. ఇంతట్లోనే నాకు వంటా, పనీ చేసిపెట్టే పనికుర్రాడు హనుమాన్ వచ్చాడు.

"హనుమాన్ చేస్తాడులే నువ్వు స్నానం చెయ్యి మధూ," అన్నాను.

"అబ్బే, వాడితో లాభంలేదు ఈ యిల్లు చూస్తూంటే నాకు తేళ్ళూ, జెర్రెలూ పాకినట్లు వుంది. భోజనం చేసి వచ్చి, యీ యింట్లో ఎలా కూచుంటాం? నువ్వెళ్ళి భోజనం చేసిరా ప్రకాశ్" చీర పైకి కట్టింది మధూ.

"నువ్వు రాకపోతే బెనర్జీ భార్య నొచ్చుకుంటుంది. తప్పు పట్టుకుంటారు."

"అయామ్ సారీ." మధు తన పనిలో నిమగ్నమయింది

నాకు కోపం వచ్చింది ఏం చెయ్యాలో తెలియలేదు. క్రొత్తపెళ్ళి కూతురు. బాగా పరిచయంలేదు. చిన్నపిల్ల కాదు, అదమాయించడానికి. నాతో సమంగా చదువు

కున్నది. వ్యక్తిత్వమున్న మనిషి. అలా ప్రవర్తిస్తూంటే ఏంచెయ్యను? క్రొత్త కాపరం యిలా మొదలైందని బాధపడుతూ, స్నానంచేసి, బెనర్జీ యింటికి వెళ్ళాను.

"ఆవిడకి ఒంట్లో బాగాలేదు" అని అబద్ధం చెప్పి, బెనర్జీ దగ్గిర తప్పించుకున్నాను. బెనర్జీ భార్య భోజనం అంతా కారియర్‌లో పెట్టి యిస్తే యింటికి తీసుకువచ్చా.

మధు తడిగుడ్డతో కుర్చీలు, టేబిల్స్ తుడుస్తోంది, హనుమాన్ తలుపులూ, ద్వారబంధాలూ తుడుస్తున్నాడు.

"మధూ, యింకా అలాగే వున్నావా? భోజనం తెచ్చాను."

"వంటింట్లో పెట్టు." మధు తల ఎత్తలేదు

నేను స్కూటర్ తీసుకుని వూళ్ళోకి వెళ్లాను. తిరిగి వచ్చేసరికి సాయంత్రమయింది. ఇంటికి రాగానే నా చిరాకంతా పటాపంచలైంది

ఇల్లు నీట్‌గా సర్దివుంది. తలుపులూ, కుర్చీలు, ప్రతి వస్తువూ పాలిష్ చేసినట్టు మెరుస్తున్నాయి ఏదో అద్భుత మాయ పాత యింటిని క్రొత్త యిల్లుగా మార్చేసినట్టుంది. మధు శక్తిని లోలోపలే అభినందించకుండా వుండలేకపోయాను.

తెల్లటి చీర కట్టుకుని, ఫాన్ క్రింద కుర్చీలో కూర్చుని పేపరు చదువుతోంది మధు. ఆమె తడిజుట్టులోంచి షాంపూ వాసనలు వ్యాపిస్తున్నాయి. వెళ్ళి మధు బుగ్గమీద ముద్దుపెట్టుకున్నా.

"ఓహ్ బయటినించి తిన్నగా వచ్చి యీ పనేమిటి? కాళ్ళూ, చేతులూ కడుక్కున్నావా?" బుగ్గ రుమాలుతో తుడుచుకుంది మధు

"సారీ "

బూట్లు విప్పి, బట్టలు మార్చుకుని, బాత్‌రూమ్‌లోకివెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కుని వచ్చా.

"ఇప్పుడు ముట్టుకోవచ్చా ?" మధు ప్రక్కనే కూర్చున్నా.

"సరే లే! బూట్లు యిక్కడేనేంటి విప్పుకోడం? జోళ్ళ స్టాండ్‌లో పెట్టుకోవాలి "

"హనుమాన్ పెడతాడులే "

"వాడు వచ్చేదాకా యిలాగే వుంటాయి."

"హనుమాన్ - టీ" అని కేకేసి, పేపరు చూస్తూ కూర్చున్నా.

"వాడు లేడు. నేను టీ పెడతాను."

"ఎక్కడికెళ్ళాడు ?"

"స్నానంచేసి బట్టలు మార్చుకుని రమ్మని నేనే పంపాను "

"ఇంక యివాళ్టికి వాడు వచ్చినట్టే. పనివాళ్ళని మధ్యలో ఎప్పుడూ యింటికి పంపకూడదు మధూ."

"వాడు రాకపోతే నేనేచేసుకుంటా. కుళ్ళుబట్టలూ, వాడూ. చూస్తే

డోకొస్తున్నాడు" మధు వంటింట్లోకి వెళ్ళింది.

ఆ రోజే కాదు, హన్‌మాన్ బట్టలు కుళ్ళుగా వుంటాయని రోజూ విసుక్కునేది మధూ. సబ్బు యిచ్చి, వాణ్ణి బట్టలు వుతుక్కుని స్నానం చేసి రమ్మనేది. సబ్బులు మాయం అయ్యేవి. వాడు మట్టికొట్టుకునే వుండే వాడు. హనుమాన్‌ని వంటింట్లోకి రాని చ్చేదికాదు మధు. బయట పనే కాని రోజంతా యిల్లు తుడుస్తూ, తడిగుడ్డతో వత్తుతూ వుండేవాడు హనుమాన్. వాడు బట్టలు వుతికితే పనికిరాదు. ఆమె మళ్ళీ వుతుక్కునేది.

మధుకి యిష్టమైన పనులు రెండు. ఇల్లు సర్దడం, పేపరు, పుస్తకాలు చదవడం. ఏ పని చేసినా, మనసంతా దానిమీదే కేంద్రీకరించేది

పెళ్ళైన క్రొత్త రోజులే ఓ సెలవు రోజు మా యింటికి అతిథులు వచ్చారు. వాళ్ళు భోజనంచేసి వెళ్ళారు.

రోజంతా సరదాగా గడిచి పోయింది. ఎవరు వచ్చినా యింటినీ, మధూనీ, ఆమె వంటనీ మెచ్చు కోకుండా వుండలేరు. ఆమెతో మాట్లాడిన మగవాళ్ళు ఆమె తెలివి తేటలనీ, ప్రపంచజ్ఞానాన్నీ గమనించ కుండా వుండలేరు. వారి కళ్ళలో కనపడే మెచ్చికోలు చూసి నాకు చాలా గర్వంగా వుండేది. ఆ రోజూ భోజనం బాగుంది అతిథులు వెళ్ళేసరికి రాత్రి పదిదాటింది. హనుమాన్ సహాయంతో గిన్నెలూ, గదీ శుభ్రంచేయించి వచ్చింది మధు.

అలసిపోయి వున్నాం. దినపత్రిక పట్టుకుని పడుకుంది మధూ.

"లైటార్పేయనా?" అన్నాను.

"వద్దు. ఇవాల్టి పేపరు చూడాలి."

"రేపు చూడకూడదా?"

"వుహుఁ. పేపర్ చదవకపోతే నిద్దరపట్టదు నాకు"

ఆవిడ పేపరు చదవడం అంటే నాకు తెలుసు. మొదటి పేజీనించి ఆఖరి పేజీలో ఆఖరు లైన్‌దాకా చదవాలి ఎంతసేపు మేలుకోను? నాకేమో యీ రోజు వచ్చిన అతిథుల గురించీ వంటల గురించీ, వాళ్ళు మెచ్చుకోడం, అన్నీ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ పడుకోవాలని సరదా. కాని మధూతో లాభంలేదు. తన నిర్ణయాలకి తిరుగులేదు. ఈ కొద్ది రోజులలోనే ఆ సంగతి గ్రహించాం.

"ప్రకాశ్, నువ్వు పడుకో. నేను ముందుగదిలో కూర్చుని చదువు కుంటా. గుడ్‌నైట్" మధు లైటార్పి వెళ్ళిపోయింది.

మా యిద్దరి మధ్యా నలుగుతున్న మరో విషయం - సిగరెట్లు, నాలుగేళ్ళ బ్రహ్మచారి జీవితంలో ధూమపానం బాగా అలవాటైంది

నాకు మధుకి నేను సిగరెట్టు కాల్చడం యిష్టం వుండదు. ఆమెకి సిగరెట్టు వాసన పడదు అంటుంది నన్ను దగ్గిరకి చేరనివ్వదు.

ఆమె సాన్నిధ్యం కోసమని యింట్లో నేను సిగరెట్లు కాల్చడం మానుకున్నా కాని ఆఫీసులో సిగరెట్టు లేకపోతే పని జరగదు. మెదడు పనిచెయ్యదు

ఇంటికి రాగానే బట్టలు మార్చుకుని, స్నానాల గదిలోకి వెళ్ళి, పళ్ళు తోముకోడం అలవాటు చేసుకున్నా, ఎప్పుడేనా బద్ధికించి పళ్ళు తోముకోక పోతే, "అబ్బ, వాసన ప్రకాశ్" అంటుంది మధు, ముక్కుకు రుమాలు అడ్డంపెట్టుకుంటూ. తాగి వచ్చిన వాడి తంతు అయ్యేది నా పని. ఆమెకి జవాబు చెప్పలేని నా మెత్తదనం మీద నాకే కోపం వచ్చేది.

"అవునులే మధూ, నువ్వెన్నైనా చెప్పగలవ్. నీకు చెడ్డఅలవాట్లు లేవు. మానుకోవాలనే బాధాలేదు ఒక్కసారి మారిపోవాలంటే ఎంత కష్టమో నీకెలా తెలుస్తుంది?"

"విల్ పవర్ వుంటే ఏదైనా సాధించవచ్చు."

"సిగరెట్లు కాల్చడంవల్ల అన్నీ నష్టాలే డబ్బూ, ఆరోగ్యం— ఒప్పు కుంటావా?" మధూ రెట్టించింది.

"అన్నీ ఒప్పుకుంటా. కాని నేను అలవాటుకి బందీని. పొమ్మంటే ఎలా పోతుంది?"

"నీ కోసం నేనేమైనా మానెయ్యనా!" అంది మధూ, సీరియస్‌గా ముఖంపెట్టి

"నువ్వేం మానేస్తావ్?"

"వారానికి ఒకరోజు భోజనం మానేస్తా. శనివారం వుపవాస ముంటా."

"నువ్వు వుపవాసం చేస్తే నా కొచ్చే లాభం ఏంటి?"

"ఇన్‌స్పిరేషన్. భోజనం మానేసి నేను వుండగిలిగనప్పుడు నువ్వు సిగరెట్లు మానేసి వుండలేవా?"

ఆమెతో ఏం వాదించను? నాకు ఏ చెడ్డ అలవాటూ లేకుండా మంచి వాడిగా చేసెయ్యాలని ఆమెకు ఎందు కంత తపన? ఏమిటీ పంతం?

మధు అన్నట్టే శనివారాలు భోజనం మానేసి వుపవాసాలు ప్రారంభించింది. నాకు తల గోడకేసి కొట్టుకోవాలనిపించింది. ఆమె అంత సులభంగా భోజనం ఎలా మానేసి కటిక వుపవాసం చెయ్యగలదో అంతు పట్టని విషయం నాకు సిగరెట్లు మానేస్తే పిచ్చెత్తినట్టు వుంటోంది

మేం యింకా కాపరంలో స్థిరపడనే లేదు. మూడో మెంబరు మా జీవితాల్లో ప్రవేశించాడు.

నెలలు నిండుతున్నకొద్దీ మధు

అందం యినుమడించింది. ఆమె బుగ్గలలో నునువూ, ఆమె కళ్ళలో కాంతీ, నన్ను సమ్మోహితుడిని చేసేవి.

అయితే ఆమె చాదస్తం కూడా రోజు రోజుకూ పెరిగింది ఇంటి శుభ్రం, బట్టల శుభ్రం అంటూ యిటు నన్నూ, అటు హనుమాన్నీ వేధించేది కట్టు కున్నవాడిని, నాకు వేరేదారిలేదు. ఆమె ఆనందంకోసం మధుకి యిష్ట ప్రకారమే చేసేవాడిని కాని డబ్బుకి పనిచేసే హనుమాన్‌కి ఆ అవసరం లేదు మధుకి ఆరు నెలలు నిండుతున్నా యనగా వాడు మా యింట్లో పని మానుకున్నాడు.

ఒంటరిగా ఆ పరిస్థితిలో పనిచేసుకో లేదని మధుని పుట్టింటికి పంపేను. ఆమెని రైలెక్కిస్తూ "నువ్వు వచ్చేదాకా క్షణం ఒక యుగంగా గడుపుతా మధూ" అన్నాను ఆమె తియ్యగా నవ్వింది ఇంటికి ఒక్కడినీ వెళ్ళాలంటే బాధగా అనిపించింది. స్నేహితులతో సాయంత్రందాకా గడిపి, రాత్రి హోటల్లో భోజనంచేసి, యింటికి వచ్చా.

రాత్రి యింట్లో ఒంటరిగా కూర్చుంటే ఏవేవో ఆలోచనలు వచ్చాయి ఈ ఏడాదిలో యిల్లెంతో మారిపోయింది. డ్రాయింగ్ రూమ్ లోకి కార్పెట్టు వచ్చింది, కిటికీలకి, గుమ్మాలకి అందమైన డిజైనులతో వున్న తెరలు అమిరాయి. పుస్తకాలూ, పేపర్లూ- ప్రతి చిన్న వస్తువూ పొందికగా సర్దిపెట్టి వున్నాయి, ఎక్కడా ఒక్క మరకకాని, మచ్చ కాని లేదు పడకగదిలో పరుపుల మీద మల్లెపూవుల లాంటి తెల్లటి దుప్పట్లు వున్నాయి. ఆ పరుపులు ఎప్పుడూ ఆహ్వానిస్తున్నట్టే వుంటాయి. మధు ఏ పని చేసినా అద్భుతంగా చేస్తుంది

సోఫామీద దిండు వేసుకుని, కూర్చున్ని, బూట్లేనా విప్పని కాళ్ళు టీపాయ్ మీద జాపుకుని సిగరెట్టు కాలుస్తూ, తల వెనక్కి వాల్చి ఆలోచిస్తున్నా. ఆ పోజులో, చేతిలో సిగరెట్టుతో నన్ను చూస్తే మధు ఏమంటుంది ? నవ్వు వచ్చింది. హఠాత్తుగా నాకెందుకో సిగరెట్టు పొగతో పాటు స్వేచ్ఛావాయువు పీల్చినట్టైంది, నా వూహకి సిగ్గుపడ్డా

రాహుల్‌కి మూడు నెలలు రాగానే, నేను వెళ్ళి మధూని, రాహుల్‌ని తీసుకువచ్చాను రాహుల్ ఎఱ్ఱగా, బొద్దుగా ఏపిల్ పండులా వున్నాడు.

ఇంట్లోకి క్రొత్త పనివాడు రామేశ్వర్ వచ్చాడు

''రాహుల్'' అంటూ ఆఫీసునించి వస్తూనే వాడి వుయ్యాలలోకి తొంగి చూసాను. చక్కటి పౌడరు వాసన.



వాడు కళ్ళు తెరుచుకుని, రంగు గిలకలని పరిశీలించి చూస్తున్నాడు "ఓహో, మీరు లేచే వున్నారా ?" అంటూ వాణ్ణి చిటికలు వేసి నవ్వించాను. బోసి నవ్వులు ఒలకబోసాడు పలకరించినకొద్దీ నవ్వుతున్నాడు. చిన్న నోరు వెడల్పు చేసి నవ్వినపుడు, కళ్ళు మెరుస్తున్నాయి సంతోషంతో వాడిని ఎత్తుకుని ముద్దులు కురిపించాను.

"అబ్బబ్బ, ప్రకాశ్ ఎన్నిసార్లు చెప్పాలి ? చేతులూ కాళ్ళూ కడుక్కోకుండే రాహుల్ ని ఎత్తుకోవద్దని ! పిల్లలికి ఇన్ ఫెక్షన్ తొందరగా వస్తుంది" మధు, బాబుని నా చేతుల్లోంచి లాక్కుంది

చేతిలోని అమృతభాండాన్ని ఎవరో రాక్షసుడు లాక్కున్నంత బాధ కలిగింది.

"వూరికే నన్ను అన్ని విషయాలలో చెక్ చెయ్యకు మధూ" చిరాకు పడుతూ, ముందు గదిలోకి వచ్చేసాను.

మధు లేని ఆరు నెలలలో మళ్ళీ నా పాత అలవాట్లు నా దగ్గిరకి చేరాయి ఇప్పుడు ఆమె కోసం సిగరెట్లు మానెయ్యాలంటే నాకు బాధగావుంది కోపం ముక్కుమీద వుంటోంది ప్రతిదానికీ చిరాకు ఎక్కువౌతోంది.

అయితే, మధు నన్ను ఎప్పుడూ అర్థంచేసుకోడానికి ప్రయత్నించినట్లు కనబడదు తన మాటే తనది

రాహుల్ పెద్దవాడు అవుతున్న కొద్దీ మా మధ్య భేదాభిప్రాయాలు ఎక్కువతున్నాయి వాడు మట్టిలో ఆడకూడదు కొన్ని నిర్ణీత సమయాల్లోనే బయట ఆడుకోవాలి, అంటుంది

మధు నాణ్ణి సేచ్ఛగా వదిలెయ్యి అంటాను నేను

ఈ మధ్య కాలంలో మేం టాటానగర్ నించి కలకత్తా మారాం. నా వుద్యోగపు హోదా పెరిగింది.

రాహుల్ ని స్కూల్లో వేసాం వాడి పెంపకం బాధ్యతంతా మధూదే వాడు చాలా తెలివైనవాడు ఏ విషయానై్ననా యిట్టే పట్టుకుంటాడు

వాడ్ని 'మంచి బాలుడు' గా మార్చాలని మధు తాపత్రయం ప్రతి క్షణం వాడిమీద ఆంక్షలు పెడుతూనే వుంటుంది. "కుర్చీలో యిలా కూచోవాలి, కాళ్ళు క్రింద పెట్టాలి, కాళ్ళు ఆడించకూడదు; టేబిల్ మీద భోజనం చేసేటప్పుడు యిలా తినాలి, అలా చెయ్యి చాపకూడదు, బట్టలు మాపకూడదు, గట్టిగా అరవకూడదు" వంద శిక్షణలు వాడు తప్పుచేస్తే శిక్షిస్తుంది నీళ్ళగదిలో పెట్టి బంధిస్తుంది, లేదా ఓ పూట అన్నం పెట్టదు. నాకివేం నచ్చవు. ఆ పసివాడి కంట్లో నీరు తిరిగితే చూడలేను.

మధూకీ, నాకూ రాహుల్ విషయంలో రోజూ మాట మీద మాట పెరుగుతోంది "రాహుల్ నాకూ కొడుకే వాడి పెంపకంలో నాకూ బాధ్యతవుంది" అంటే మధు యిచ్చే జవాబు - "నువ్వు పెంచితే నీ అలవాట్లే వస్తాయ్ ప్రకాశ్"

నాకేమంత చెడ్డఅలవాట్లు వున్నాయని? సిగరెట్లు కాల్చడం, రోజుకో అరుసార్లు టీ త్రాగటం మహాపరాధాలా? "నువ్వే దైనా వుద్యోగంలో చేరకూడదా మధూ? నీ తెలివితేటలూ, డిగ్రీ వృధా అవుతున్నాయి కదా?" అన్నాను, ఆమె వుద్యోగంలో చేరితే మా తండ్రీ, కొడుకులమీద కొన్ని ఆంక్షలు తగ్గుతాయేమో అనే భావంతో.

"నాకు తీరికెక్కడ ప్రకాశ్ అయినా నువ్వు సంపాదించినది మనకు హాయిగా సరిపోతుందిగా" అని కొట్టిపారేసింది

రాహుల్ కి ఏడు సంవత్సరాలప్పుడు నేను జర్మనీ వెళ్ళాను ఓ సంవత్సరం వుండి వచ్చా ఈ ఏడాది దూరం మధులో మార్పు తీసుకువస్తుందనుకున్నా కాని తనేం మారలేదు. నాలోనే మార్పు వచ్చింది హఠాత్తుగా మధుతో దెబ్బలాడే ఓర్పూ, సహనం పోయింది ఆమె చెప్పిన దానికల్లా అవుననడం, ఒప్పేసుకోడం నేర్చుకున్నా దీనికి కారణం ఆఫీసులో నా పదవి పెరగడం, బాధ్యత ఎక్కువ కావడం కావచ్చు కారు కొన్నాను

రాహుల్ విషయం కూడా పట్టించుకోవడం మానేసా ఆఫీసులో పని చూసుకోడం, యింట్లో మధు చెప్పి

నట్లల్లా వినడం అన్నిటికీ 'అవునూ' అనేయడంతో మా మధ్య మాటలే ఆగిపోయాయి. ఇంట్లో ఒకరకం నిశ్శబ్దం ఆవరించింది. మా సంభాషణ లన్నీ యిలాగే జరిగేవి :

"ఎల్లుండి రాహుల్ పుట్టినరోజు. ఏం చేద్దాం ప్రకాశ్ ?"

"ఏం చేద్దాం ?"

"సింపుల్ గా చేసేద్దామా? వాడికో కొత్త డ్రెస్ కొనేసి, సాయంత్రం ముగ్గురం బయటికి వెళ్ళి ఐస్ క్రీమ్ తిందామా ?"

"తిందాం."

మధు కాస్సేపు ఆగుతుంది. "వాడు సైకిల్ అంటే పరదాపడుతున్నాడు. సైకిల్ కొని ప్రజెంట్ చేస్తే?"

"అలాగే సైకిల్ కొందాం "

మధు ఓ పదినిమిషాలు ఆలోచిస్తుంది.

"పోనీ, వాడి స్నేహితులని ఓ నలుగురిని పిలిచి చిన్న పార్టీ యిస్తే బాగుంటుందేమో !"

"అలాగే యిద్దాం."

"ఏమేం చేస్తే బాగుంటుది ?"

"నువ్వే చెప్పు." మధు నావైపు పరీక్షగా చూసి, మౌనం వహిస్తుంది

ఇంట్లో మామూలుగా గడిచి పోతోంది ఎవరి దినచర్యలో వాళ్ళు వుంటున్నాం. బొంబాయిలో మంచి వుద్యోగపు ప్రకటన వస్తే పెట్టాను ఆ వుద్యోగం వచ్చింది. నివాసం బొంబాయి మారింది. కంపెనీవాళ్ళు పెద్ద యిల్లు యిచ్చారు.

కాని మధులో ఎందుకో వుత్సాహం లేదు. కొంచెం స్తబ్దుగా తయారైంది

"ఈ మారు సెలవకి ఊటీ వెళదామా ?" అంది.

"వెళదాం" అన్నాను, పేపరు చదువుతూనే

కాస్సేపు గోళ్ళు చూసుకుంటూ కూచుంది రాహుల్ హైటార్పి పడు కున్నాడు.

"మా అమ్మకి ఒంట్లో బాగాలేదని అన్నయ్య తీసుకువెళ్ళాడు కదా! ఢిల్లీ వెళ్ళి మా అమ్మని చూసి వద్దామా?"

"అలాగే చూద్దాం, టిక్కెట్లు కొననా ?"

మధు సమాధానం చెప్పలేదు.

నేను పేపరు పేజీ త్రిప్పుతూ, ఎదురుగుండా చూసాను. మధు నావైపే దీక్షగా చూస్తోంది ఆమె కళ్ళలో భావంచూసి గతుక్కు మన్నాను. ఆ కళ్ళు క్రొత్తగా వున్నాయి వాటిలో ఏదో భయం, అపనమ్మకం. హఠాత్తుగా మధు గట్టిగా ఏడ్చింది

"అరే, ఏమైంది మధూ ?" ఆమె

ప్రక్కనే వెళ్ళి కూర్చున్నా. ఆమె భుజాలు పట్టుకున్నాను.

"నువ్వు చాలా మారిపోయావ్, ప్రకాశ్."

"ఎలా మారిపోయా ?"

మధు జవాబు చెప్పలేదు వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంతో రీవిగా గంభీరంగా వుండే ఆమె ఏడుస్తూ వుంటే నా మనసు వికలమైంది. మధుని నెమ్మదిగా తీసుకువెళ్ళి ప్రక్క మీద పడుకోబెట్టాను ఆమె ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది రాహుల్ మేలుకుని వుంటే ఎంత బాగుండును! వాడి ఎదురుగా మధు ఏడవడానికి సాహసించేది కాదు.

ఆ రాత్రి చాలా సేపటిదాకా నాకు నిద్రపట్టలేదు

మధు అంటే నాకెంతో యిష్టం. ఆమెకోసం నేను ఎన్నో అలవాట్లు మానుకున్నాను. సిగరెట్లు మానేసిన క్రొత్తలో నన్నెంతో మంది స్నేహితులు "భార్యాదాసుడని" వెక్కిరించారు. అవన్నీ సహించాను. ఒకటి రెండుసార్లు ఓ చుక్క వేసుకున్నానని, మధు నానా గొడవా చేస్తే, పార్టీలలో మద్యం సేవించడం కూడా మానుకున్నాను నేను పోట్లాడిన విషయాల్లో కూడా మధు దగ్గిర ఎప్పుడూ నేనే ఓడిపోతూవచ్చాను. అన్నిటిలోనూ గెలుపు ఆమెది. ఆమె అలా నెగ్గించుకునేది. ఆమె అందం, తెలివి తేటలూ, వాగ్ధాటి నన్ను ఆమెకి వశుణ్ణి చేసాయి నేను నిస్సహాయుడిలా ఓటమి అంగీకరించాను

కాని చివరికి ఏమైంది? మధు ఏడ్చింది. ఆమెకి సంతోషం కలిగించలేకపోయా ఎందుకిలా అయింది ?

నాకీ మధ్య క్రొత్త ఆలోచనలు వస్తున్నాయి మధు యింత అందంగా వుండకపోతే బాగుండును ఆమె తెలివి తేటలు కూడా సామాన్యమైనవైతే బాగుండును ఇంతకంటె మేం ఎక్కువగా సుఖపడేవాళ్ళమేమో!

ఇంట్లో క్రొత్త పరిస్థితి ఏర్పడింది. మధు చాలా స్తబ్దుగా మారింది. రాహుల్ చదువు విషయం కూడా. శ్రద్ధతీసుకోవటం. లేదు. రాహుల్ కి క్లాసులో రాంక్ తగ్గిపోతోంది వాడి శ్రద్ధ ఆటలమీదకీ, స్నేహితుల మీదకి మళ్ళింది

ఆ రోజు ఆఫీసులో మీటింగ్ వుండి, యింటికి ఆలస్యంగా వచ్చాను. డ్రాయింగ్ రూమ్‌లో రాహుల్, స్నేహితుడితో మాట్లాడుతున్నాడు.

బట్టలు మార్చుకుని డైనింగ్ టేబిల్ దగ్గిరకి వచ్చాను కప్పులో వేడి టీ, ప్రక్కనే ప్లేటులో వుప్పు చిక్కట్లు, జాగ్రత్తగా మడిచిపెట్టిన ఆ రోజు దినపత్రికా నా కోసం ఎదురు చూస్తున్నాయి మధు పనిలో చిన్న



లోపం కూడా ఎత్తి చూపించలేము. అన్నీ అంత పర్ఫెక్ట్‌గా వుంటాయి.

రాహుల్ స్నేహితుడు వెళ్ళినట్టు వున్నాడు. వీధితలుపు మెల్లిగా తీసి, వేసిన శబ్దమైంది వెంటనే ఖంగుమంటూ మధు గొంతుక వినిపించింది.

"రాహుల్, ఎన్నిసార్లు చెప్పాను? ఆ క్రికెట్ బాల్‌కి, బాట్‌కి స్థానం సోఫామీదా? నీ గదిలో పెట్టుకు వచ్చి కూర్చోకూడదా?"

"అబ్బ, వుండమ్మా సత్యపాల్‌తో మాట్లాడుతూ కూర్చుండిపోయా" వాడు విసుక్కున్నాడు

"పెద్దవాళ్ళకి జవాబు చెప్పడం కూడా నేర్చుకో" ఆమెలో కోపం.

"జవాబు చెప్పకపోతే, చెప్ప లేదంటావ్. చెబితే ఎదురుతిరిగానంటావ్ ఎలాగమ్మా నీతోటి?"

"షటప్, రాహుల్ ఇక్కణ్ణించి పో"

"ఆఁ పోతున్నా... నువ్వెప్పుడూ యింతేనమ్మా. నాన్ననీ, నన్నూ అన్నిటికీ గదమాయిస్తావ్. ఎందుకనీ మా యిద్దరిమీద అంత కోపం?".

నేను టీ వదిలేసి, లేచి, ముందు గదిలోకి వచ్చాను. రాహుల్ జోళ్ళు చప్పుడు చేసుకుంటూ తన గదిలోకి వెళిపోతున్నాడు.

"రాహుల్"

నా పిలుపు విని ఆగి "ఏం నాన్నా" అన్నాడు.

"అలాగేనా అమ్మతో మాట్లాడ్డం?"

వాడు వొక్కసారి నిరసనగా చూసి, మౌనంగా తన గదిలోకి వెళిపోయాడు

మధు 'అబ్బా' అంటూ నిలుచున్న చోటే నేలకి ఒరిగిపోయింది. ఆమెను కంగారుగా ఎత్తుకు తీసుకువెళ్ళి పడక మీద పడుకోబెట్టి, డాక్టర్‌కి ఫోన్ చేసాను.

మధుకి హార్ట్ ఎటాక్ వచ్చింది.